సమయం లేదు మిత్రమా!

- రేషన్ కార్డుల ఈ-కేవైసీకి నేడు ముగియనున్న గడువు
- లబ్ధిదారుల్లో కొరవడిన చైతన్యం



ఈ-కేవైసీ చేయించుకుంటున్న లబ్ధిదారుడు

తాడిపత్రి రూరల్: రేషన్‌కార్డుదారులకు ఈ-కేవైసీ కోసం బుధవారం గడువు ముగియనుంది. ఈ నెల 30న ఈ-కేవైసీకి కూటమి ప్రభుత్వం డెడ్‌లైన్ విధించింది. గత నెల 31 వరకూ ఉన్న గడువును మరో నెల పెంచుతూ ప్రభుత్వం ఏప్రిల్ 30న డెడ్ లైన్ విధించింది. అప్పటిలోపు కార్డుదారులు ఈ-కేవైసీ వేయించుకోకుండే మే నెల నుంచి రేషన్ సరుకుల పంపిణీ నిలిపివేయనున్నారు. రేషన్ ఇవ్వరన్న విషయం తెలియకపోవడం వల్ల వేలాది మంది లబ్ధిదారులు ఈ-కేవైసీ వేయించుకోలేదు. కార్డులకు ఈ-కేవైసీ పూర్తి కాకపోవడంతో మరోసారి గడువు పెంచుతారా? లేక రేషన్ కోటాను తగ్గించాలన్న దురుద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం పేదల కడుపు కొడుతుందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కార్డుదారుల్లో చైతన్యం తీసుకురావడానికి వివిధ చర్యలు తీసుకున్నామని రెవెన్యూ అధికారులు చెబుతున్న మాటలకు చేతలకు తేడా ఉందనడానికి కారణం అధిక సంఖ్యలో ఈ-కేవైసీలు పెండింగ్‌లో ఉండటమే. మీ సేవ, సచివాలయాలు, డీలర్ల వద్ద ఈ-కేవైసీ వేయించుకోవచ్చని లబ్ధిదారులకు సూచించామని అధికారులు పేర్కొంటున్నారు. కానీ డీలర్లు నెలలో వారం రేషన్ దుకాణాలు తెరవడమే బద్ధకం. ఇక సచివాలయాల సిబ్బందిని వివిధ రకాల సర్వేల కోసం తిప్పడానికే సరిపోయింది. సాయంత్రం అయితే వివిధ రకాల సమావేశాల పేరుతో అధికారులు కార్యాలయాల చుట్టు తిప్పుకోవడంతో సరిపోతోంది. ఎప్పుడు వారు కార్డుదారులకు అందుబాటులో ఉంటారో వారికే తెలియదు. దిన కూలీలు పనులు వదిలిపెట్టి మీ సేవ కార్యాలయాల చుట్టూ తిరిగి ఈ-కేవైసీలు వేయించుకోవడానికి వెళ్లడం లేదు. ఇతర ప్రాంతాల్లో ఉపాధి కోసం వెళ్లి అక్కడే ఉన్నవారు ఈ - కేవైసీ కోసం రావడం లేదు.

కూటమి కుట్ర

కూటమి ప్రభుత్వం త్వరలో కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేయనుంది. ఇందులో భాగంగానే రేషన్ కార్డులను భారీగా తగ్గించడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. ఈ-కేవైసీ పేరుతో లబ్ధిదారులను గణనీయంగా తగ్గించనుంది. మరో నెల గడువు పెంచినా లబ్ధిదారులు ఈ-కేవైసీ వేయించుకోలేదంటే వారిలో ఎక్కువ శాతం మంది బోగస్ అంటూ కోటాలో కోత విధించనుంది.



ఈ-కేవైసీ వివరాలు..

మండలం	కార్డుల్లోని సభ్యులు	ఈకేవైసీ పెండింగ్
తాడిపత్రి	1,40,366	6,826
యల్లనూరు	31,077	1,544
పుట్లూరు	32,987	1,439
పెద్దపప్పూరు	31,731	1,065
యాడికి	50,276	1,962
పెద్దవడుగూరు	42,146	1,863
శింగనమల	39,000	2,055
ఆత్మకూరు	35,563	2,565
గార్లదిన్నె	50,794	2,868
బుక్కరాయ సముద్రం	64,334	3,753
నార్పల	51,969	3,307
గుంతకల్లు	1,45,936	8,983
గుత్తి	7,7514	5,168
పామిడి	50,466	2720

తప్పనిసరిగా ఈ-కేవైసీ వేయించుకోవాలి



రేషన్ కార్డుల లబ్ధిదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలి. ఇందుకు కేవలం ఒక రోజు మాత్రమే గడువు ఉంది. గడువు పొడగింపుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి అదేశాలు రాలేదు. పెండింగ్‌లో ఉన్న ఈ-కేవైసీలకు సంబంధించి రేషన్‌పై ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. పూర్తి స్థాయిలో ఈ-కేవైసీ వేయించుకోవాలని లబ్ధిదారులకు సూచించాం. వారి కోసం డీలర్లు, సచివాలయ ఉద్యోగులను అందుబాటులో ఉంచాం. అలాగే ఐదేళ్లలోపు చిన్నారులు, 80 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఈ-కేవైసీ అవసరం లేదు.

– రజాక్‌వలి, తహసీల్దార్

క్లుప్తంగా

ఖైదీలకు ఉచితంగా న్యాయ సేవలు



ఖైదీ సమస్యలను తెలుసుకుంటున్న జిల్లా జడ్జి రాజశేఖర్

బుక్కరాయసముద్రం: జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్న ఖైదీలకు ఉచితంగా న్యాయ సేవలు అందించేందుకు కృషి చేస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అనంతపురం జిల్లా జైలును ఆయన తనిఖీ చేశారు. ముందుగా జైల్లో ఖైదీల బ్యారెక్‌లను పరిశీలించారు. వంట గదులను తనిఖీ చేసి ఆహార పదార్థాలను పరిశీలించారు. ఖైదీలకు తయారు చేసిన ఆహార పదార్థాలను స్వయంగా రుచి చూశారు. ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందుతున్న వైద్య సదుపాయాలు, మౌలిక వసతులపై ఆరా తీశారు. జైలు వాతావరణం పరిశీలించారు. ఖైదీలకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామన్నారు. ఖైదీలకు మంచి నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు. వారి సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ రహ్మాన్, జైలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలపై జాగ్రత్తలు పాటించండి



మాట్లాడుతున్న చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వరి

గుంతకల్లుటౌన్: వేసవి సెలవుల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించి ప్రమాదాల బారిన పడకుండా చూసుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ సంస్థ పీఓ వెంకటేశ్వరి సూచించారు. మంగళవారం దోనిముక్కల రోడ్డు, 60 అడుగుల రోడ్డు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. సెలవుల్లో పిల్లలు బోరుబావులు, నీటికుంటలు, రిజర్వాయర్ల వద్దకు ఈతకు వెళ్లకుండా చూసుకోవాలన్నారు. అనంతరం బాల్య వివాహాల నిరోధక చట్టం, పోక్సో చట్టం, బాలల హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్వాడీ టీచర్లు రేష్మా, సునీత, రాణి, మెహరాజ్, సరోజ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న దొడ్డప్ప

గుంతకల్లు: మహనీయులు జయంత్యుత్సవాలను పురస్కరించుకుని సత్యసాయి జిల్లా మడకశిరలో నిర్వహించిన కార్యక్రమంలో గుంతకల్లుకు చెందిన పోలేరమ్మ దేవాలయ ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డప్ప (మేస్త్రీ) డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అవార్డును అందుకున్నారు. సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలు మన్నలు పొందుతున్న దొడ్డప్పను అవార్డుకు ఎంపిక చేసినట్లు దళిత పోరాట హక్కుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతు తెలిపారు. మంగళవారం మడకశిరలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనతోపాటు జేవీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్‌యాదవ్, టిప్పు సుల్తాన్ యూనిటైడ్ ఫ్రెంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫరూక్‌ఖాన్ చేతుల మీదుగా అవార్డును అందజేసి సత్కరించారు.

ఐటీఐ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లుటౌన్: పదో తరగతి పాసై ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో చేరదలచిన విద్యార్థులు మే 24లోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సీహెచ్ విద్యాసాగర్ సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వెంటనే ఒరిజినల్ సర్టిఫికెట్లను ఐటీఐ కళాశాలలో వెరిఫికేషన్ చేయించుకోవాలని మంగళవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

ఓబులేశుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో ఓబులేసు స్వామి

పెద్దపప్పూరు: మండలంలోని జూటూరులో ఓబులేసుస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం గ్రామస్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మైదుకూరు పట్టణానికి చెందిన కోలాటం భజన బృందం సభ్యులు చేసిన నాట్యాలు ఆకట్టుకున్నాయి. వేడుకను తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



యాడికి మండలంలో పర్యటిస్తున్న కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి టౌన్/యాడికి: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. ఆయన మంగళవారం తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికి, పెద్దవడుగూరు గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. మొదటగా యాడికి మండలంలోని నగరూరులో వైఎస్సార్‌సీపీ నాయకుడు బ్రహ్మానందరెడ్డి కుటుంబ సభ్యులను పలకరించారు. తర్వాత ఇటీవలే వివాహం చేసుకున్న తూట్రాళ్లపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి కుమారుడు, కోడలిని ఆశీర్వదించారు. అదే గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చాకలి చిన్నవెంకటన్నను పరామర్శించారు. అనంతరం పెద్దవడుగూరు మండలం కండ్లగూడూరులో జరిగే ఓ విందుకు హాజరయ్యేందుకు మాజీ ఎమ్మెల్యేను పోలీసులు అడ్డుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ యాడికి మండల కన్వీనర్ సంజీవరాయుడు, జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, బోగతి బ్రహ్మానందరెడ్డి, కేశవరెడ్డి చిదంబరయ్య, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఉపేంద్ర గౌడ్, శివయ్య, ముత్యాలరెడ్డి, నాగేశ్వరెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మంగళవారం రాత్రి స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రఘునాథరెడ్డి, జిలాన్, సత్తార్, రామాంజి, ఆశాబీ, రామ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు నాణ్యతతో చేపట్టాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ సలీంబాషా

పుట్లూరు: ఉపాధి పనులను నాణ్యతగా చేపట్టాలని డ్వామా పీడీ సలీంబాషా సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని చెర్లోపల్లి, సి.వెంగన్నపల్లి పంచాయతీల పరిధిలో చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పశువుల నీటి తొట్టె నిర్మాణాన్ని పరిశీలించి మూగ జీవాలకు తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే పశువుల షెడ్డు నిర్మాణాన్ని పరిశీలించి పనుల నాణ్యతపై ఆరా తీశారు. సి.వెంగన్నపల్లి సమీపంలో చేపడుతున్న ఉపాధి పనుల వద్ద కూలీలతో ఆయన మాట్లాడారు. పనుల్లో అవకతవకలకు పాల్పడితే అధికారుల దృష్టికి తీసుకరావాలని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీఓ నరేంద్ర, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కూడేరు వరకూ రోడ్డు నిర్మించాలి



కోటంక నుంచి పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

గార్లదిన్నె: గార్లదిన్నె నుంచి కూడేరు బైపాస్ వరకూ తారు రోడ్డు నిర్మించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో కోటంక నుంచి గార్లదిన్నె వరకూ పాదయాత్ర చేశారు. ముఖ్య అతిథి సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంభూపాల్ మాట్లాడుతూ గార్లదిన్నె నుంచి కూడేరు వరకు రోడ్డు గుంతలు పడడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే వాహనదారులు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఈరమ్మకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి, మండల కార్యదర్శి చెన్నారెడ్డి, వలి, క్రిష్టయ్య, నాగార్జున రెడ్డి, నాయణ రెడ్డి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి జాతర



పెద్దమ్మ తల్లిని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న దృశ్యం



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న గ్రామ నాయకులు

తాడిపత్రి/తాడిపత్రిటౌన్: మండలంలోని ఊరిచింతల గ్రామంలో మంగళవారం పెద్దమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించారు. జాతరకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్ రెడ్డి హాజరై పెద్దమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. బంధువులు, మిత్రులను జాతరకు పిలిచి విందు ఇచ్చారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు జాతరకు వెళ్లి విందులో పాల్గొన్నారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం



డీఈ హేమచంద్రతో వాగ్వాదానికి దిగిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

గుత్తి: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. వివరాలు.. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, చైర్ పర్సన్ వన్నూర్‌బీ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఉదయం 11.30 గంటలకు సమావేశం ప్రారంభం కాగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు సమస్యలపై అధికారులను నిలదీశారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు వంటి సమస్యలను లేవనెత్తారు. పలుమార్లు సమస్యలను విన్నవించినా ఎందుకు పరిష్కారం చేయడం లేదని ధ్వజమెత్తారు. మున్సిపల్ అధికారులతో కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. వార్డుల్లో పర్యటించే సమయంలో తమకు ఎందుకు సమాచారం ఇవ్వడం లేదని కౌన్సిలర్లు మూకుమ్మడిగా ప్రశ్నించారు. డీఈ హేమచంద్ర ప్రతి సారీ సమాచారం ఇవ్వాల్సిన పనిలేదని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. దీంతో కౌన్సిలర్లందరూ మూకుమ్మడిగా డీఈపై తీరుపై ధ్వజమెత్తారు. తాను అలా అనలేదని, ప్రతిసారీ ఇవ్వడం అంటే కష్టంగా ఉంటుందని అధికారికంగా పర్యటించిన సమయంలో తప్పకుండా సమాచారం ఇస్తానని సమాధానమివ్వడంతో వివాదం సద్దుమణిగింది. వార్డుల్లో పర్యటించే సమయంలో కచ్చితంగా సమాచారం ఇస్తామని కమిషనర్ ప్రకటించారు. ఏ అధికారైనా సమాచారం ఇవ్వకుంటే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

4న 'అంబేడ్కర్' నాటకం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో మే-4వ తేదీన 'బీఆర్ అంబేడ్కర్ మళ్లీ మన మండలానికి' అనే నాటకం ప్రదర్శిస్తున్నట్లు కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ సాల్‌మాన్, ఈఓఆర్‌డీ సదాశివ చేతులు మీదుగా కేవీపీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ నాటకంపై పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమలో సర్వేయర్ ప్రతాప్ రెడ్డి, బీకేఎస్ సెక్రటరీ శ్రీనివాసులు, రైతు సంఘం నాయకుడు కుళ్లాయప్ప, సీఐటీయూ నాయకులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ ఆధ్వర్యంలో క్రికెట్ శిక్షణ

గుంతకల్లు: స్థానిక ఎస్‌జేపీ హైస్కూల్ క్రీడా మైదానంలో మే 1 నుంచి ఆరర్డీటీ ఆధ్వర్యంలో వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేసినట్లు క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.హరినాథ్‌గౌడ్, కోచ్ కే.ఇనయతుల్లా మంగళవారం ఓ ప్రకటనలో పేరర్కొనన్నారు. పట్టణ, మండల గ్రామీణ క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడాకారులు వైట్ యూనిఫారంతో హాజరు కావాలనన్నారు. శిక్షణకు హాజరయ్యేవారు 9701435534 నంబర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వారు కోరారు.

3న దేవదాయ భూములకు కౌలు వేలం

పామిడి: మండలంలోని వంకరాజుకాలువ గ్రామంలోని ఆంజనేయ, భైరవస్వాముల దేవదాయ భూములకు మే 3న కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ క్రిష్ణయ్య మంగళవారం తెలిపారు. స్థానిక ఆలయంలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం ఉంటుందన్నారు. 2025-26, 27, 28 సంవత్సరాలకు నిర్వహించే వేలంలో పాల్గొన దలచిన వారు రూ.500 డిపాజిట్ చేయాలన్నారు. ఆసక్తి ఉన్న వారు 9441012561 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేడు పౌరహక్కుల దినోత్సవం

పెద్దవడుగూరు: మండలంలోని మిడుతూరులో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఉషారాణి మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి ఎస్సీ కాలనీ ప్రజలు హాజరై, వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకరావాలని సూచించారు. మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

సంక్షిప్త సమాచారం


7న వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్లలో మే 7న వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. మంగళవారం గ్రామస్తులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ దశమి రోజు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. 5వ తేదీ పతాక ఆవిష్కరణ, 6న ముహూర్తం, గణపతి పూజ, అభిషేకం, 7న ఉదయం 6-15 నిషాలకు స్వామి వారి కల్యాణం,ఆరాధన నిర్వహిస్తామన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

'ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి'

బుక్కరాయసముద్రం: రైతులు తప్పని సరిగా ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని తహసీల్దార్ శ్యాం సుందర్‌రెడ్డి సూచించారు. 11 అంకెల రిజిస్ట్రేషన్ కోసం రైతులు వివరాలను రైతు సేవా కేంద్రాలలో నమోదు చేయించుకోవాలన్నారు. ఇప్పటి వరకూ మండలంలో 5,767 మంది రైతుల రిజిస్ట్రేషన్ పూర్తి అయిందన్నారు. 4,766 మంది ఇంకా నమోదు చేయించు కోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర పథకాల లబ్ధి పొందుటకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు.

యువకుడి మృతి



మృతిచెందిన విజయ్

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ విజయ్ అనే యువకుడు మంగళవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. గుత్తి పట్టణంలోని తాడిపత్రి రోడ్డు జంగాల కాలనీకి చెందిన విజయ్ పని నిమిత్తం వెళ్తుండగా ఈ నెల 10న జక్కలచెరువు గ్రామ శివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని గుత్తి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు తరలించారు. అక్కడ 20 రోజులుగా చికిత్స పొందుతూ కోలుకోలేక అతడు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రంథాలయంలో సమ్మర్‌క్యాంప్

పెద్దవడుగూరు: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం సమ్మర్ క్యాంపు నిర్వహించారు. విద్యార్థులతో బాల మిత్ర కథలు, నీతి కథలు పుస్తకాలు చదివించారు. గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు బాషా సాహెబ్ మాట్లాడుతూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం క్యారెమ్స్ , చెస్ గురించి వివరించారు.

2 నుంచి 'కిశోరి వికాసం'

తాడిపత్రి రూరల్: మే 2 నుంచి జూన్ 12 వరకూ నిర్వహించనున్న కిశోరి వికాసం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐసీడీఎస్ పీడీ నాగమణి సూచించారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం, రమణ మహర్షి ఆశ్రమంలో నిర్వహించిన కార్యక్రమాల్లో కిశోరి వికాసంపై అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎస్‌కే, ఆశా, అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. పీడీ మాట్లాడుతూ ప్రతి మంగళ, శుక్రవారాల్లో అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలోని కిశోరి బాలికలతో సమావేశం కావాలన్నారు. సమావేశాల్లో ప్రధానంగా కిశోర బాలికల స్కూల్ డ్రాప్ అవుట్స్ లేకుండా చూడటం, బాల్య వివాహాలను అరికట్టడం, కష్ట, నష్టాలను వివరించి చైతన్య పరచడం, ఆరోగ్య సూచలనలు, సలహాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ శివరామక్రిష్ణ, సీడీపీఓ సాజిదాభేగం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే వైవీఆర్

గుత్తి రూరల్: మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం రాత్రి గుంతకల్లు పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీపురం గ్రామానికి చెందిన దేవనబండ రాముడు, బొలిగొర్ల హరి, లక్ష్మీనారాయణ, చిన్న ఆంజనేయులు తదితరులు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లయ్యయాదవ్ ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ టీడీపీ నాయకులు ప్రలోభాలు చూపి పార్టీలో చేర్చుకున్నారన్నారు. తమ గ్రామంలో సమస్యలు పరిష్కరిస్తామని టీడీపీ నాయకులు హామీలిచ్చి.. నేడు పట్టించుకోకపోవడంతో తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో చల్ల నెట్టికంటయ్య, గద్దల ప్రభాకర్, ఎడవలి ఆంజనేయులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి



మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ భవనాన్ని ప్రారంభిస్తున్న తిమ్మప్ప

గుత్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మాజీ సైనిక ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లాల సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప సూచించారు. గుత్తిలోని కోర్టు కాంప్లెక్స్ సమీపంలో నూతనంగా నిర్మించిన మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మాజీ సైనికుల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గుత్తి మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు జింకా రామమూర్తి, కార్యదర్శి కృష్ణయ్య, సభ్యులు గిరీష్, బాబా, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత

గుత్తి: పట్టణంలోని ఎంఎస్ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థులు చేయూతనందించారు. 1986-87 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు మంగళవారం ఎంఎస్ పాఠశాలకు వెళ్లారు. క్లాస్ రూమ్‌లలో బ్లాక్ బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు బెంచీలు ఏర్పాటు చేశారు. వ్యాయామం చేసుకునేందుకు కట్టకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు నాగేంద్ర ప్రసాద్, నాగ సుదర్శన్, కమిలిని, స్పందన చక్రి, దీన దయాల్ తదితరులు మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం భవిష్యత్‌లో సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

గుంతకల్లుటౌన్: పట్టణంలోని హనుమేష్‌నగర్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, కూరగాయల మార్కెట్‌లలో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ పరిశీలించారు. మంగళవారం ఉదయం శానిటేషన్ అధికారులతో కలిసి ఆయన ఆయా ఏరియాల్లో పర్యటించారు. చెత్తా చెదారాన్ని ఎక్కడపడితే అక్కడ పడేయరాదని, చెత్త ట్రాక్టర్లకు మాత్రమే అందజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మార్కెట్‌లో చెత్తను ఎప్పటికప్పుడు సేకరించాలని ఆయన సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గార్లదిన్నె: మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై సుధీర్ లారీ కాటా సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాలు మేరకు.. గార్లదిన్నెకు చెందిన వెంకటరాముడు అనే వ్యక్తి రాత్రి సమయంలో సుధీర్ లారీ కాటా వద్ద రోడ్డు అవతలి వైపు దాటుతుండగా అదే సమయంలో అనంతపురం నుంచి గుత్తి వైపు వెళ్లే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో అతడి రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108లో క్షతగాత్రున్ని అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగిన రిలే దీక్షలు

తాడిపత్రి రూరల్: డిమాండ్ల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరింది. ఆర్టీసీ డిపో ఆవరణలో జరిగిన రిలే దీక్షల్లో డ్రైవర్లు రాజు, రంగయ్య, గౌడ్, లక్ష్మయ్య కండెక్టర్లు శశికళ, కుమారి, ఎస్‌ఆర్ కుమారి, రమణయ్య, శేఖర్, నీలకంఠ పాల్గొన్నారు.